క్లుప్తంగా

సులువుగా బోధించాలి



బద్రాా తండా పాఠశాలలో విద్యార్థులతో వాక్యాలు రాయిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధించాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని బద్రాాతండాలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు, విద్యార్థుల ప్రతిభ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. పాఠశాలలో నాల్గవ తరగతి విద్యార్థులతో తెలుగు వాక్యాలు రాయించామని, చిన్న తప్పులు మినహా బాగానే రాశారన్నారు. సులభ బోధన విషయంలో ఉపాధ్యాయులు పలు విషయాలు సూచించామన్నారు. జిల్లాలోనే చిలప్‌చెడ్ మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా మండల ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భిక్షపతి ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



సూచనలు చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్‌లో హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి శనివారం పరిశీలించారు. ఆలయం నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరు గ్రామంలో ఆలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకోవాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు విఠల్, బీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు ఇప్పించండి



గాంధారిపల్లిలో రక్తాన్ని సేకరిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): మూగ జీవాలకు గాలికుంటు టీకాలు ఇప్పించాలని వెటర్నరీ ఏడీ పవన్ కుమార్, మండల వెటర్నరీ డాక్టర్ సౌమ్యరెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని గాంధారిపల్లిలో 86 పశువులకు రోగ నిరోధకశక్తి సామర్థ్యాన్ని పరీక్షించే నిమిత్తం, టీకా ఇవ్వడానికి ముందు రక్త నమూన సేకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సతీష్ కుమార్, ఖాజా సలావుద్దీన్, శివాజీ, సురేష్, భూపాల్‌గౌడ్, యాదయ్య, బాలరాజ్, సయ్యద్, గోపాల మిత్ర షరొద్దీన్, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం, మన్యసూక్త పారాయణం నిర్వహించారు. దంపతులు సత్యనారాయణ మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించున్నారు. దాతల సాయంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రభుశర్మ, సిబ్బంది ఉన్నారు.

ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన దంపతులు ప్రాణహాని ఉందని శనివారం మెదక్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కోదాస్ పూలమ్మ స్వామి దంపతులను అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కులం పేరుతో దూషించి, దాడి చేసి, భయందోళనకు గురిచేశాడని వివరించారు. ఈ విషయంపై శివ్వంపేటలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ వెంకట్‌రెడ్డితో పాటు మాపై కూడా ఎస్‌ఐ అకారణంగా కేసు నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని వారు ఎస్పీని కోరారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు మరమ్మతుల పనులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పోతులబోగూడ నుంచి అనంతారం చౌరస్తా వరకు ఉన్న పంచాయతీ రాజ్ సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖకు బదిలీ చేశారు. రోడ్డు అధ్వానంగా మారడంతో పోతులబోగూడ, పాంబండ, ఉసిరికపల్లి, చండి, గోమారం, లచ్చిరెడ్డిగూడం, నవాబుపేటతో పాటు పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రం మెదక్ నుంచి హైదరాబాదుకు వెళ్లేందుకు ఈ రోడ్డు అనువైన మార్గం. ఇతర మండల ప్రజలకు కూడా ఈ రోడ్డు ద్వారా రాకపోకలు కొనసాగిస్తుంటారు.

నత్త నడకన పనులు

రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. 16 కిలో మీటర్ల మేరా రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు సీఆర్‌ఎఫ్ ద్వారా రూ.38 కోట్ల నిధులు మంజూరైనవి. పనులు దక్కించుకున్న సదరు గుత్తేదారు మొదట్లో పనులు వేగంగా చేసినప్పటికీ ప్రస్తుతం ఉసిరికపల్లి నుంచి పోతులబోగూడ వరకు. చెండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. తవ్వకాలు చేసి వదిలేయడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దూర భారంతో వెళ్తున్నాం



చండి గ్రామం నుండిచి బాలనగర్ వెళ్లాలంటే అనంతారం చైరస్తా మీదుగా దగ్గర అవుతోంది. రోడ్డు పనులు నిలిచిపోవడం వల్ల దూరభారంతో నర్సాపూర్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. దీని వల్ల సమయం, డబ్బులు వృథా అవుతున్నాయి.

– మధుసూదన్, చండి

నిత్యం ప్రమాదాలు



రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పనులు ప్రారంభించి సంవత్సరం అవుతున్నా.. పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– అశోక్, నవాబుపేట

పనులు పూర్తి చేయిస్తాం

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఉసిరికపల్లి నుంచి పోతులబోగూడ వరకు పనులు జరుగుతున్నాయని చండి నుంచి అనంతారం చౌరస్తా వరకు పనులు పూర్తి చేయించి వాహనదారులు ఇబ్బందులు తొలగిస్తాం.

– నాగరాజు, డీఈ, ఆర్అండ్‌బీ

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



తూప్రాన్: ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు



నర్సాపూర్ రూరల్: ఆయుధాలను ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్ రూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలతో పాటు పోలీసులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరమని నర్సాపూర్ ఎస్‌ఐ లింగం అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ పట్టణంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరు కాగా, వారికి పోలీసుల సేవలు, ఉపయోగించే ఆయుధ సామగ్రిని ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్, రామచందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చట్టాలు, ఆయుధాలు, నేరాలు తదితర అంశాలను సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం విద్యార్థులకు వివరించారు. ఫిర్యాదుల స్వీకరణ, ఎఫ్‌ఐఆర్ నమోదు వివరాలను తెలిపారు. అనంతరం ఆయుధాల రకాలు, వాటి పనితీరును అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్

పెద్దశంకరంపేట(మెదక్): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పోలీసు చట్టాలపై ఎస్‌ఐ.శంకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించి రికార్డులు, పోలీసు కేసులు, నేరాల గురించి వివరించారు. దీంతో పాటు అత్యవసర సమయాల్లో డయల్ 100 ఏ విధంగా చేయాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సునీత, హెడ్‌కానిస్టేబుల్ విఠల్, సిబ్బంది రమేశ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

- ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్



కౌడిపల్లి(నర్సాపూర్): రాజిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని రాజిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలకు మట్టిపెడ్డలు, పొల్లు లేకుండా ధాన్యం తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ నాగరాజు, మాజీ సర్పంచ్ లింగంగౌడ్, నాయకులు గణేశ్‌గౌడ్, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాలోజిపల్లిలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని సాలోజిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ విఠల్ నాయకులతో రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, ఏపీఎం రామకృష్ణ, ఎంఈఓ మంజుల, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

చేగుంట(తూప్రాన్): టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నర్సింగరావు, బాలపోచయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉపాధ్యాయ పత్రిక ఎడిటర్ శశిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా, మండలాధ్యక్షుడిగా నర్సింగారావు, ప్రధాన కార్యదర్శిగా బాలపోచయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్, కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశం పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.దామోదర్ శనివారం తెలిపారు. రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, రెండేళ్ల డిప్లమా కోర్సులు పాసైన విద్యార్థులు ఓపెన్ డిగ్రీకి అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాల పరిశీలన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల విద్యాధికారి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు చేస్తూ మెరుగైన విద్య బోధనకు అవసరమైన పద్ధతులను అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉపేందర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం వెంకటేశం, సీఆర్పీ రాములు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

బీజేపీలో చేరికలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకులు మాజీ జెడ్పీటీసీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రానికి చెందిన సుధాకర్, అమర్, ఎల్లం, పంజా కుమార్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సిద్ధారాంరెడ్డి, పోచయ్య, బాబు నాయకులు పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ సుశీల్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినయ్‌సుశీల్

హవేళిఘణాపూర్(మెదక్): వైరల్ ఫీవర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్దన పీహెచ్‌సీ డాక్టర్ వినయ్‌సుశీల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సర్దన పీహెచ్‌సీలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రికి ప్రస్తుతం నిత్యం 80 మందికి పైగా రోగులు వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. మెదక్, హవేళిఘణాపూర్ మండల పరిధిలోని బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి వైద్యం, మందులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో ధర్మగ్రహ దీక్ష కరపత్రం ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి

- టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ధర్మగ్రహ దీక్ష కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుందన్నారు. అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఉపాధ్యాయుల అన్ని డీఏలను ఏరియర్స్‌తో కలిసి చెల్లించాలన్నారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

- తహసీల్దార్ శ్రీనివాస్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

నర్సాపూర్ రూరల్: రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఐకేపీ సమాఖ్య కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే ఐకేపీ సీఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం రవాణా, డబ్బుల చెల్లింపు, ఇప్పటికప్పుడు పూర్తి చేస్తూ రైతులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరీ శంకర్, ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి, సీసీలు దేవి సింగ్, ప్రవీణ, భాగ్య, రవీందర్ ఆంజనేయులు సీఏలు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థినులు పురుషులతో సమానంగా విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. మంత్రాలు, దెయ్యాలు ఉన్నాయనే నమ్మకాన్ని వీడి ధైర్యంతో సమాజంలో మనోధైర్యంతో ముందుకెళ్లాలన్నారు. విద్యలో రాణిస్తే భవిష్యత్‌లో ఏదైనా సాధించవచ్చని సూచించారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసే దిశగా బాగా చదువుకోవాలని సూచించారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు నరేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూఢనమ్మకాలు, మ్యాజిక్ ద్వారా అవగాహన కల్పించారు. మహిళల రక్షక, మంత్రాలు, మూఢనమ్మకాల ద్వారా ఎలా మోసపోతారనే దానిపై విద్యార్థినులకు మ్యాజిక్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజు, పోలీసు సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు

- పట్టుబడిన పది టిప్పర్లు, ఐదు ఇటాచీలు



మాట్లాడుతున్న సీఐ రంగాకృష్ణా

మనోహరాబాద్(తూప్రాన్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న పది టిప్పర్లు, ఐదు ఇటాచీలను పట్టుకొని సీజ్ చేసినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణా తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం అర్ధరాత్రి దాడి చేసి వాహనాలు పట్టుకున్నట్లు తెలిపారు. మట్టి రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎంతటి వారైనా అనుమతులు లేకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తూప్రాన్ సర్కిల్ పరిధిలో అనుమతులు తీసుకుని మట్టి రవాణా చేయాలని టిప్పర్ యజమానులకు సూచించారు. వీరి వెంట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తదితరులున్నారు.

క్రీడల్లో రాణించాలి

శివ్వంపేట(నర్సాపూర్): యువత వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా సామగ్రి కోసం రూ.10 వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాలకు టీవీ బహూకరణ**

పాపన్నపేట(మెదక్): మండలంలోని పాడిచన్‌పల్లి తండా ప్రాథమిక పాఠశాలకు శనివారం మెదక్‌కి చెందిన సీహెచ్.సురేష్ టీవీ బహూకరించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు ఉపయోగపడుతుందని హెచ్ఎం స్వామి తెలిపారు.

◆ **నిధులు మంజూరు చేయాలి**



నర్సాపూర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని హోలీయ దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నోసార్లు ఎస్సీ, ఎస్టీ ఉపకులాల నిధులు మంజూరు చేయాలని పోరాటాలు చేయగా, 2013లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకు నిధులు, రుణాలు, పత్రిక ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు 60 చదరపు గజాల స్థలం,డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

◆ **పాఠశాలలో బియ్యం చోరీ**

చేఉంట(తూప్రాన్): మండల పరిధిలోని కర్నాల్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు బియ్యం చోరీ చేసిన సంఘటన శనివారం వెలుగు చూసింది. హెచ్ఎం సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తాళం పగులగొట్టి కార్యాలయం గది తలుపు తెరిచి ఉంచడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రెండు బియ్యం బస్తాలు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో చోరీ జరిగిన విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

◆ **నోట్ బుక్స్ పంపిణీ**

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలను శనివారం వీఎస్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఫ్యాకల్టీ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఫ్యాకల్టీ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై సలహాలు, సూచనలు చేశారు. సైబర్ నేరాలు, పోషకాహారం, డబ్బు నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, ఆయా రకాల స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్ గౌడ్, హెచ్ఎం తారా సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



◆ **సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**



హవేళిఘణాపూర్(మెదక్): ప్రస్తుతం జరుగుతున్న నేరాల కట్టడికి మండలంలోని కల్లు దుకాణ యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళి అన్నారు. మెదక్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కల్లు దుకాణ యజమానులతో ఎస్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా కల్లు దుకాణంలోకి గుర్తు తెలియని వ్యక్తులు కల్లు, మద్యం సేవించిన సమయంలో నేరాలకు పాల్పడడం జరిగితే సీసీ కెమెరాల ద్వారా త్వరగా గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతీ దుకాణం ఎదుట నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఏఎస్‌ఐ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

మెదక్ మున్సిపాలిటీ: డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని టౌన్ సీఐ నాగరాజు అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెదక్ టౌన్‌లోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆదర్శ జూనియర్ కళాశాల యందు డ్రగ్స్- సైన్సు- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టౌన్ సీఐ నాగరాజు, నరేశ్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. ఈ సందర్భంగా సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మచ్చేంద్రనాథ్, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

◆ **కేజీబీవీలో సమస్యలను పరిష్కరిస్తాం**



మనోహరాబాద్(తూప్రాన్): కేజీబీవీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కూచారం గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండే పదార్థాలను, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దీక్షిత్‌కుమార్, ఎస్ఓ గౌతమి తదితరులున్నారు.